క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆదినారాయణ

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేయడం తప్పా ఆచరణకు నోచుకోవడం లేదని స్వరాజ్య భారత్ అధ్యక్షుడు దుక్క ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో మంజూరైన డిగ్రీ కళాశాల తరగతులు నేటికీ ప్రారంభం కాకపోవడం ఈ ప్రాంత విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. అన్ని వనరులు, సదుపాయాలు అనుకూలంగా ఉన్నప్పటికీ అనుమతుల జాప్యంతో తరగతులు ప్రారంభ కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాంత ప్రజలు డిగ్రీ చదవాలంటే 30 కిలోమీటర్లు ప్రయణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ ఏడాది నుంచైనా తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు శిష్టరత్న అవార్డులు



విద్యార్థులకు అవార్డులు అందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణ కుల విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించి సమాజంలో తమ జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టినందుకు ఎంతో ఆనందంగా ఉందని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని శిష్టకరణ సంఘం భవనంలో జిల్లా సంఘం ఆధ్వర్యంలో శిష్టరత్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా శిష్టకరణ సంఘం ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ, జిల్లా సంఘం నాయకులు బి.రామచంద్రరావు, ఆర్.వి.ఎస్ శర్మ, వినోద్, బీవీఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ప్రతిభావంతులకు పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి కులం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులను మరింత ఉత్తేజపరచడానికి ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను అధిరోహించి పద్మశాలి కులానికి, సమాజానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలతో గురుకుల పాఠశాల సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక హయాతీనగరంలోని మహాత్మా జ్యోతీరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకులం పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వన మహోత్సవం-2025 కార్యక్రమాన్ని నిర్వహించి, పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దోమలపై సమరం..!

- ఊరూవాడా మలేరియా మాసోత్సవాలు
- దోమల నియంత్రణపై విస్తృతంగా ప్రచారం



తోటపాలేంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



దుప్పలవలస కాలువ పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ఎచ్చెర్ల: వర్షాకాలం సమీపిస్తోంది. రుతు పవనాల ఆగమనం కూడా అనుకున్నట్లుగానే ఉంది. ఇదే సమయంలో ప్రజలు, అధికారులను సీజనల్ వ్యాధులు భయపెడుతున్నాయి. మరీ ముఖ్యంగా మలేరియా వ్యాధి ఎక్కువగా వ్యాపించే సీజన్ ఇదే. దీంతో వైద్యారోగ్య సిబ్బంది మలేరియా నియంత్రణ చర్యల్లో బిజీ అయ్యారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఊరూవాడా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 30 వరకు మలేరియా నియంత్రణకు ఊరూవాడా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలను కలిసి పరిసరాల పరిశుభ్రత, రోగాలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది

ఎచ్చెర్ల మండలంలోని ఎచ్చెర్ల, పొన్నాడ పరిధిలో 28 పంచాయతీలు ఉన్నాయి. మలేరియా నియంత్రణకు వైద్యారోగ్య సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీరికి తోడుగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు చెబుతున్నారు.

దోమల నియంత్రణపై దృష్టి

మలేరియాతోపాటు చాలా సీజనల్ వ్యాధులు దోమల ద్వారానే వ్యాపిస్తున్నాయి. దోమలు ఎక్కువగా నిల్వ నీటిలోనే వృద్ధి చెందుతాయి. దీంతో కాలువలు, నిల్వ నీరున్న చోట దోమల నియంత్రణ మందు పిచికారీ చేస్తున్నారు. కాలువలు, బావులు తదితర నీటి నిల్వలున్న చోట గాంబూషియా చేపలను విడిచిపెడుతున్నారు. ఇవి దోమల లార్వాలను తినడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఇటువంటి చేపలను మున్సిపాలిటీ ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారు. అదేవిధంగా దోమతెరలు, దోమ చక్రాల ద్వారా కూడా రక్షణ పొందవచ్చంటున్నారు. దోమలను అరికడితే మలేరియా, డెంగీ, చికిన్ గున్యా, మెదడువాపు, బోధ తదితర వ్యాధుల బారినపడే అవకాశాలు తగ్గుతాయని తెలియజేస్తున్నారు.

మలేరియాపై అప్రమత్తం

మలేరియా ఆడ అనాఫిలస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. దీనిలో వైవాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సిఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. చలి జ్వరం, వణుకుతో కూడిన జ్వరం దీని ప్రధాన లక్షణం. చిన్న పిల్లలు, గర్భిణులకు ఈ వ్యాధి ప్రమాదకరమైనది. జ్వరం వచ్చిన రెండు మూడు రోజుల్లో రక్త పరీక్షల ద్వారా దీన్ని గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే భయపడాల్సిన పనిలేదని వైద్యులు పేర్కొంటున్నారు.

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత

మలేరియా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గర్లోని వైద్యులను సంప్రదించాలి. వ్యాధి సోకిన వ్యక్తి సకాలంలో మందులు వాడితే ప్రాణహాని నుంచి తప్పించుకోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుంది. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు సహకరిస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచవచ్చు.

– రమ్యారాగిణి, వైద్యురాలు, పొన్నాడ పీహెచ్‌సీ

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఈ సీజన్‌లో ఎక్కువగా వ్యాపించేది మలేరియా. అందుకే ఈ వ్యాధిపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోజుల తరబడి నిల్వ నీరు లేకుండా వారంలో ఓ రోజు డ్రై డే పాటించేలా ప్రజల్ని చైతన్యపరుస్తున్నాం. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయి. దోమ కాటుకు పగలు, రాత్రి అనే తేడా లేదు. ఏ సమయంలో కుట్టినా వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. చిన్నపాటి జ్వరం వచ్చినా సమీపంలోని వైద్యులను సంప్రదించి, మందులు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

– ఇప్పిలి చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్, ఎచ్చెర్ల

విశేష సేవలు.. అభినందనలు



మెదడుకు శస్త్రచికిత్స జరుపుతున్న దృశ్యం



డాక్టర్ సురేంద్రనాథ్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలోని న్యూరో విభాగంలో హెచ్‌వోడీగా పనిచేస్తున్న డాక్టర్ చాల్లా రపు సురేంద్రనాథ్ విశేష సేవలందిస్తూ రోగుల అభినందనలు పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రిమ్స్‌కు న్యూరో, కార్డియాలజీ, ఆంకాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలను మంజూరు చేశారు. న్యూరో విభాగానికి ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా మంజూరు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యులకు పదోన్నతులు కల్పించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేంద్రనాథ్ శ్రీకాకుళం రిమ్స్ న్యూరో విభాగానికి హెచ్‌వోడీగా వచ్చారు. అయితే మిగిలిన మూడు పోస్టులు భర్తీ కాకుండా ఉండిపోయాయి. న్యూరో సర్జన్‌గా ఉన్న సురేంద్రనాథ్ విభాగానికి ఒకే ఒక్కడు అయినప్పటికీ వారంలో రెండుసార్లు ఓపీ నిర్వహిస్తూ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరుపుతున్నారు. గడిచిన ఏడాదిన్నరలో 50పైగా వెన్నెముక, 50 వరకు మెదడులో కణతులు తొలగింపు వంటి కీలమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. విశాఖపట్నం నుంచి బదిలీపై వచ్చిన కొందరు వైద్యులు అక్కడనుంచి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ఈయన మాత్రం స్థానికంగానే నివాసముంటూ రోగులకు అందుబాటులో ఉంటున్నారు.

'చింత'న లేని ఆరోగ్యం



మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింత చిగురు

- చింత చిగురుతో ఎన్నో ప్రయోజనాలు
- నగరంలో పెరిగిన గిరాకీ

శ్రీకాకుళం: చింత చిగురుకు డిమాండ్ పెరిగింది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే చింతచిగురు నగరంలో పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉండే ఈ చిగురును తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. పప్పు, పచ్చడి, రసం, పులిహోరతో పాటు మాంసం వంటకాల్లోనూ చింత చిగురును విరివిగా వినియోగిస్తుంటారు. వీటితో తయారుచేసిన వంటకాలు ప్రస్తుతం రెస్టారెంట్‌లలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పుష్కలంగా పోషకాలు

చింత చిగురులో ఎన్నో పోషకాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు శరీరంలో ఉన్న అన్ని వాత సంబంధిత నొప్పులను నివారిస్తాయి. బెనుకులు, కండరాలు, కీళ్ల నొప్పులు ఉన్న చోట లేపనంగా ఉపయోగించి ఉపశమనం పొందవచ్చు. యాంటీ మైక్రోబియల్ గుణాలు బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వంటి ఇన్‌ఫెక్షన్‌లను తగ్గిస్తాయి. చర్మ సంబంధిత సమస్యలను తగ్గించటంతో పాటు ఇందులో ఉన్న సీ-విటమిన్ వలన చర్మం కాంతివంతం అవుతుంది. గజ్జి, తామర, చుండ్రు తగ్గించుకోవచ్చు. గాయాలు మాన్పేందుకు సైతం ఉపకరిస్తుంది. జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది. ఒత్తిడిని తగ్గించటంలోను ప్రధాన పాత్ర పోషిస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు, పొట్టి శ్రీరాములు కూరగాయల మార్కెట్‌లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మహిళలు చింత చిగురును కిలో రూ.700 విక్రయిస్తున్నారు.

కాల భైరవస్వామికి పూజలు



పూజలందుకుంటున్న కాల భైరవస్వామికి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజా, నిత్య అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం



ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ గ్రామంలో హరేరామ బృందం ఆధ్వర్యంలో గత నలభై రోజులుగా జరుగుతున్న వేసవి శిబిరం ఆదివారంతో ముగిసింది. దీనిలో భాగంగా చిన్నారులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వడం జరిగింది. నగరానికి చెందిన మిమిక్రీ శ్రీనివాస్ బృందం బాలబాలికలకు ధ్రువపత్రాలు, వాటర్ బాటిల్స్, బిస్కెట్స్ గ్రామపెద్దల ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాంబాబు గురుస్వామి, సర్పంచ్ నేతింటి నీలప్పుడు, పంచిరెడ్డి సత్యనారాయణ, ఎస్వీ రమణ, ఇప్పిలి విష్ణుమూర్తి, వైకుంఠం, కృష్ణమూర్తి, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమ్యారాగిణి సూచనలు మేరకు యూనిట్ అధికారి అప్పారావు ఆధ్వర్యంలో దోమల నివారణ రసాయనాలు పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులకు కారణమైన దోమల నివారణే లక్ష్యంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దుప్పలవలసలోని గురుకుల పాఠశాల, కళాశాలలోని డార్మిటరీ గదులు, కిచెన్, డైనింగ్ హాల్, సిక్‌రూం, తరగతి గదులు, కార్యాలయ గదుల్లోని తలుపులు, కిటికీలు, మూలల్లో ఆల్ఫా సైపెర్మెత్రిన్ రసాయనాన్ని పిచికారీ చేశామన్నారు. విద్యార్థులు అనారోగ్య పరిస్థితులకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని హెల్త్ అసిస్టెంట్ చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు ఎం.డేవిడ్‌రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?



ఎచ్చెర్ల జాతీయ రహదారి నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు రహదారి అధ్వానంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

ప్రమాదకరం



రణస్థలం మండలంలోని జేఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ప్రమాదకర స్థితిలో ఉంది. మరికొన్ని రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. దీంతో ప్రహరీ విద్యార్థులపై పడితే పెను ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అందువలన శిథిలమైన ప్రహరీ తొలగించి కొత్తగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– రణస్థలం

కరుణించు దుర్గమ్మా



జి.సిగడాం మండలంలోని పెంట గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి చల్లదనం కోసం ముర్రాటలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– జి.సిగడాం

అ'పూర్వ' కలయిక



మండలంలోని కుశాలపురం సమీపంలో గుజరాత్‌పేట వద్దనున్న క్రిస్టల్ ప్యాలస్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2004 – 06 సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపీసీ చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఆర్జేడీ, అప్పటి ప్రిన్సిపాల్ సురిబాబు, అధ్యాపకులు విలాసమూర్తి, వాయుకుమార్, కృష్ణ, జోగినాయుడు, హరిప్రసాద్, ఎస్.అన్నపూర్ణారావు, పాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నక్కవీధిలో భక్తి సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్:

పాత శ్రీకాకుళంలో సిరిమాను ఉత్సవంలో భాగంగా నూకాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి అమ్మవార్ల ఉత్సవాల సందర్భంగా ఆదివారం పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. నక్కవీధిలోని నూకాలమ్మ దేవర వద్ద మల్లెమొగ్గల లక్ష్మీ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి జరిగింది. ముందుగా మహిళలచే సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ ప్రదర్శన చేపట్టారు. సంతోషిమాత గుడి వద్దనున్న పెద్దమ్మతల్లి దేవర వద్ద బుర్రకథ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, ఎల్.రామలింగస్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు.